నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, నవంబర్ 22 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ సబ్‌డివిజన్‌లోని 11 కేవీ ఆదిత్యనగర్ కేబుల్ ఫీడర్,11 కేవీ బృందావన్ కాలనీ ఫీడర్,11 కేవీ అరవింద్‌నగర్ ఫీడర్ ప్రాంతాల్లో శనివారం సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు..

సమతా కాలనీ మొత్తం, కోహెసర్ కాలనీ, మినీ బృందావన్ కాలనీ, విరాట్ నగర్, హకీంషా, ఆదిత్యటవర్, రామాలయం, మైనార్టీ హాస్టల్ ప్రాంతాలు

మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

అరవింద్ నగర్, అజీజ్‌బాగ్, రాహుల్ కాలనీ, రెయిన్‌బో అపార్ట్‌మెంట్, పాస్‌పోర్ట్ కార్యాలయం, ఆదిత్య టవర్, ఆనంద విహార్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలు

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

మల్లికార్జుననగర్‌లో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి

అంబర్‌పేట, నవంబర్ 22 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జుననగర్‌లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి శుక్రవారం పరిశీలించారు. స్థానికులు డ్రైనేజీ సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కార్పొరేటర్ ముందు డ్రైనేజీ సమస్యను పరిష్కరించి, ఆపై రోడ్డు పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, బీఆర్ఎస్ నాయకులు మిర్యాల శ్రీనివాస్, నరహరి, జ్యోతి, బస్తీవాసులు లక్ష్మి పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు

కాచిగూడ, నవంబర్ 22 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన 25 మందికి కల్యాణలక్ష్మి, ఆరుగురికి షాదీముబారక్ చెక్కులను శుక్రవారం హిమాయత్‌నగర్ మండలం కార్యాలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్, హిమయత్‌నగర్ తహశీల్దార్ సంధ్యారాణితో కలిసి అందజేశారు.

ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ పాలనపై యావత్ ప్రజానీకం నీరాజనం పలుకుతున్నారని, పొరుగు రాష్ట్రాల కంటే కేసీఆర్ హయంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. కేసీఆర్ పాలనలో పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో దేశంలోనే రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు.

దేశంలోనే 28 రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వం చేయలేని సాహసాన్ని తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పేదల కోసం డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మిస్తూ, ఉచితంగా అందజేశాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో కన్నె రమేశ్ యాదవ్, హిమయత్‌నగర్ ఆర్ఐ మధు, భీంరాజ్, శ్రవణ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆ డివిజన్లలో ఉపఎన్నిక ఎప్పుడో..?

గుడిమల్కాపూర్ కార్పొరేటర్ కరుణాకర్ హఠాన్మరణంతో ఏర్పడిన ఖాళీ

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మెహిదీపట్నం, శాస్త్రిపురం డివిజన్లు ఖాళీ

అబిడ్స్, నవంబర్ 22 : కార్వాన్ నియోజకవర్గం పరిధిలోని గుడిమల్కాపూర్ కార్పొరేటర్‌గా ఎన్నికైన దేవర కరుణాకర్ మృతి చెందడంతో ఖాళీ ఏర్పడిన ఈ డివిజన్‌కు ఉప ఎన్నికలు జరపరా.. అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కార్పొరేటర్ మృతి చెందితే ఉప ఎన్నికను నిర్వహించాల్సి ఉండగా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోక పోవడంతో ఉప ఎన్నిక ఉంటుందా లేదా అనే సందేహం నెలకొంటోంది. 2020 లో జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కార్వాన్ నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ నుంచి దేవర కరుణాకర్ ఘన విజయం సాధించారు. పార్టీ నుంచి విజయం సాధించిన సీనియర్ కార్పొరేటర్ కరుణాకర్ జనవరిలో హఠాన్మరణం పొందారు. దీంతో ఆ డివిజన్‌లో కార్పొరేటర్ లేకుండా పోయాడు.

కొంత కాలంగా కార్పొరేటర్ లేకుండా ఉన్న గుడిమల్కాపూర్ డివిజన్‌కు ఉప ఎన్నికలు నిర్వహించే విషయంలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడంపై డివిజన్ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా జీహెచ్‌ఎంసీ పాలకవర్గం ఎన్నికలు దగ్గర పడుతుండడంతో అధికారులు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎందుకీ జాప్యం..

గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ మృతి చెందడంతో అధికారులు ఆరు నెలల లోపు ఎన్నికలు నిర్వహిస్తే కార్పొరేటర్‌ను ఎన్నుకునేందుకు అవకాశం ఉంటుంది. కానీ ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోక పోవడంతో కార్పొరేటర్ ఉప ఎన్నిక నిర్వహించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆయన మృతి చెంది రెండేండ్లు కావస్తున్నా అధికారులు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోక పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేటర్ ఉంటే సమస్యలను విన్నవించుకునేందుకు అవకాశం ఉంటుందని, అదే విధంగా కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు పాటు పడ్తారని తెలిపారు.

వెంటనే ఎన్నికలు నిర్వహించాలి

గుడిమల్కాపూర్ డివిజన్‌కు ఉప ఎన్నికలను వెంటనే నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. డివిజన్‌లో ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేందుకు గాను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఉప ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉప ఎన్నికలు నిర్వహిస్తే నూతన కార్పొరేటర్ అందుబాటులోకి వస్తారని, దీంతో బస్తీలలోని సమస్యలను చెప్పుకునే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

మెహిదీపట్నం, శాస్త్రిపురం డివిజన్ల ఎన్నికలపై అధికారుల నిర్ణయమేమిటి ..?

జీహెచ్‌ఎంసీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా విజయం సాధించడంతో ఆ రెండు డివిజన్లు ఖాళీ అయ్యాయి. వాటికి కూడా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉన్నది. నాంపల్లి నియోజకవర్గం పరిధిలోని మెహిదీపట్నం డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న మాజిద్ హుస్సేన్ అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ తరపున నాంపల్లి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. రాజేంద్రనగర్ పరిధిలోని శాస్త్రిపురం నుంచి కార్పొరేటర్‌గా ఉన్న మహ్మద్ మొబిన్ కూడా మజ్లిస్ తరపున బహదూర్‌పురా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆ రెండు డివిజన్లకు కూడా ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. అధికారులు ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే..

ఆకట్టుకున్న పార్వతీ కల్యాణం హరికథ

రవీంద్రభారతి : కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్, కిన్నెర ఎడ్యూకేషనల్, తెలంగాణ ప్రభుత్వ, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ 47 వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రవీంద్రభారతిలో శ్రీరామ భట్టార్ భాగవతార్‌చే అన్నమయ్య, హరికథా గానం, పద్మాలయ ఆచార్య భాగవతారిణిచే పార్వతి కల్యాణం హరికథా గానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి డా.సముద్రాల వేణుగోపాలచారి విచ్చేశారు. కార్యక్రమంలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ అధినేత ముద్దాళి రఘురామ్, సంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు..

శ్వేతప్రసాద్‌కు బిస్మిల్లా ఖాన్ అవార్డు

బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం అందుకుంటున్న శ్వేత ప్రసాద్

అబిడ్స్, నవంబర్ 22: నగరానికి చెందిన శ్వేత ప్రసాద్ కర్నాటక సంగీత విభాగం 2022-23 ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్‌కు ఎంపికయ్యారు. కాగా ఆమెకు న్యూ ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సాంస్కృతిక కార్యదర్శి ఉమ నందూరి, సంగీత నాటక అకాడమి వైస్ చైర్మన్ సంధ్య అవార్డును శ్వేత ప్రసాద్‌కు అందజేశారు. శ్వేత ప్రసాద్ కళాకారులకు అవార్డులు రావడంతో వారిలో మరింత ఉత్సాహం పెరిగి ప్రతిభను కనబర్చడానికి అవకాశం ఉంటుందన్నారు. తనను ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారానికి ఎంపిక చేసి అందజేయడం సంతోషాన్నిచ్చిందని తెలిపారు.

రోగి సహాయకులకు అన్నదానం

ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానాలో అన్నదానం చేస్తున్న టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్ హుస్సేనీ

సుల్తాన్‌బజార్ : రోగి సహాయకులకు అన్నదానం చేయాలనే తల్లిదండ్రుల కోరిక మేరకు నెలలో నాలుగు సార్లు నిర్వహిస్తున్నట్లు టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ పేర్కొన్నారు. శుక్రవారం మిత్రుడు సయ్యద్ జమాల్ జహంగీర్ పుట్టినరోజు సందర్భంగా రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానలో 600 మంది రోగి సహాయకులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిత్రులు ముబారజుద్దీన్ ముజాహిద్, సయ్యద్ అసదుద్దీన్, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు కురాడి శ్రీనివాస్, సభ్యులు వైదిక్ శస్త్ర, కేంద్ర సంఘం సభ్యులు బి.శంకర్, క్యాన్సర్ దవాఖాన సిబ్బంది శివకుమార్, చంద్రశేఖర్, పీఆర్వో మహ్మద్ వహీద్, సభ్యులు ముస్తఫా షరీఫ్ పాల్గొన్నారు.

మాలధారులకు ఉచిత అన్నప్రసాదం

అబిడ్స్ : అయ్యప్ప మాలధారులకు ఉచిత అన్నప్రసాద పంపిణీని సంకట హరణ అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధులు శుక్రవారం ప్రారంభించారు. మాల వేసుకున్న అయ్యప్ప భక్తులకు డిసెంబర్ 31 వరకు మధ్యాహ్నం 12:30 నుంచి 3:30 గంటల వరకు ఉచితంగా అన్న ప్రసాదాన్ని పంపిణీని చేపట్టనున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల అయ్యప్ప దీక్షా దారులు విచ్చేసి అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

కురుక్షేత్ర అనుస్మరణాయ పుస్తకావిష్కరణ

కురుక్షేత్ర అనుస్మరణాయ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, నవంబర్ 22 : భారతీయ గొప్పతనాన్ని విదేశాలు చూస్తున్నాయని, మన సంస్కృతిని కోపాడుకోవలసిన అవసరం ఉందని వాసవి మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉప్పల రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో రచయిత అరుణ్ కొత్త రచించిన కురుక్షేత్ర అనుస్మరణాయ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యలక్ష్మి విచ్చేసి కురుక్షేత్ర అనుస్మరణాయ పుస్తకాన్ని ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నాయకుడు బొగ్గారావు వరుణ్ మాట్లాడుతూ.. రచయిత అరుణ్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో కిరణ్‌గుప్త, పోలా శ్రీనివాస్‌రావు, కె.కిరణ్‌కుమార్, నితిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేక్షకులను రెండు టీమ్‌లుగా విభజించి మహాభారతంపై క్విజ్ నిర్వహించి ఆసక్తిని పెంపొందించారు. కార్యక్రమాన్ని అరుణ్ సమన్వయం చేశారు.

సమాజసేవలో భాగస్వామ్యులు కావాలి

ఐ ఫోకస్ మిషన్ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న డైరెక్టర్ వినోద్‌యాదవ్

కాచిగూడ, నవంబర్ 22 : సమాజసేవలో భాగస్వాములు కావాలని ఐ ఫోకస్ మిషన్ డైరెక్టర్ చిట్టబోయిన వినోద్‌యాదవ్ పిలుపునిచ్చారు. 'ఐ ఫోకస్ మిషన్' 19వ వ్యవస్థాపక దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. డైరెక్టర్ వినోద్‌యాదవ్ మాట్లాడుతూ.. నైపుణ్యత పెంపొందించుకుని ఐక్యంగా ముందుకు సాగితేనే సాధించలేనిది ఏదిలేదని, సమాజంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకున్నప్పుడే మనుగడ సాధ్యమని సూచించారు. కార్యక్రమంలో సోహం అకడామి వ్యవస్థాపకుడు సహదేవ్, రేనోవా దవాఖాన అధినేత డాక్టర్ నగేశ్, సురేందర్ తిప్పరాజు, కిరణ్, ఆరిఫ్, రాకేశ్, విజయ్, వర్షిణి, తెలంగాణలోని ఐ ఫోకస్ మిషన్ సభ్యులు పాల్గొన్నారు.

సైఫాబాద్ సైన్స్ కళాశాల తొలి మహిళా ప్రిన్సిపాల్‌గా శైలజ

సుల్తాన్‌బజార్ : మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాల 74 ఏండ్ల చరిత్రలో మొట్టమొదటిసారి మహిళా ప్రిన్సిపాల్‌గా ప్రొ.కుసుమ శైలజ నియమితులయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీ ఎన్విరాన్‌మెంట్ హెడ్‌గా ఉన్న శైలజను నియమిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎం.కుమార్ ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రొఫెసర్ శైలజ బాధ్యతలను స్వీకరించారు. కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. కుసుమ శైలజ మాట్లాడుతూ.. 2000లో తన ఉద్యోగ ప్రస్థానం ఈ కళాశాల నుంచే ప్రారంభమైందన్నారు. కళాశాలకు ప్రిన్సిపాల్‌గా, తొలి మహిళా ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. అందరిని కలుపుకొని కళాశాల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ఎస్సీ వర్గీకరణను ఆమోదించే వరకు..

రెండో రోజు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మాదిగ మహాకూటమి చైర్మన్ కిరణ్‌మాదిగ

కాచిగూడ, నవంబర్ 22 : కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేంత వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆమరణ నిరాహార దీక్షలు కొనసాగుతాయని తెలంగాణ మాదిగ మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్‌మాదిగ అన్నారు.

సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పును గౌరవిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేయాలని ఎస్సీ వర్గీకరణకై ఆర్టికల్ 341ను సవరిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించాలని కోరుతూ.. దండోరా ధర్మపోరాట ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కుల సంఘాల మద్దతుతో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష శుక్రవారం బర్కత్‌పురలోని కార్యాలయంలో రెండోరోజు కొనసాగుతుంది. కిరణ్‌మాదిగ మాట్లాడుతూ.. ఈ ఆమరణ నిరాహార దీక్షకు సంగీత రాజలింగం, గొల్లపల్లి దయానంద్‌రావు, కల్యాణ్‌ప్రేమ్‌రాజ్, పుట్ట జంగన్నగౌడ్, వినోద్‌కుమార్, నల్ల సూర్యప్రకాశ్, రామన్న మాదిగ, పుంజర్ల సుధాకర్ మాదిగ, నాగుల శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ నరుణ్, అరుంధతి, మేకల నారాయణ, వెంకటయ్య, మురళిమాదిగ, భాస్కర్‌మాదిగ, రాజుమాదిగ, బాలస్వామిమాదిగ, లింగయ్య, సునీల్, డి.శ్రీనివాస్, కృష్ణారావు మాదిగ, పలు సంఘాల నాయకులు సంఘీభావం పలికారు.

బీసీల హక్కులను కేంద్రం అణిచివేస్తున్నది

కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు కుమారస్వామి

కాచిగూడ : బీసీల హక్కులను కేంద్ర ప్రభుత్వం అణిచివేస్తున్నదని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. ప్రధాని మోదీ బీసీలపై వ్యతిరేక వైఖరి అవలంబిస్తున్నాడని, బీసీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కులగణన నిర్వహించినప్పుడే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయని, బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో కేంద్రం విఫలం చెందిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణనపై ముందుకు రావడం శుభచూచికమని, కులగణనపై బీజేపీ మంత్రులు, ఎంపీలకు ధైర్యం ఉంటే దేశ వ్యాప్తంగా చేయాలని ప్రధానిపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ దళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడానికి అధికారులు కృషి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. శుక్రవారం టోలిచౌకి హకీంపేట్‌లో ఎమ్మెల్యే 60 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్ పాల్గొన్నారు.

- మెహిదీపట్నం

ఎమ్మెల్యేల పర్యటనలు

మెహిదీపట్నం : అహ్మద్‌నగర్ డివిజన్ ఫస్ట్‌లాన్సర్‌లోని అహ్మద్ బాదేపా దర్గా ప్రాంతంలో శుక్రవారం నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ పర్యటించారు. రోడ్లను నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ పర్యటించారు. ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో హెచ్‌ఎండీ ప్రహరీ నిర్మాణ పనులను చేపట్టింది. స్థానికులకు రోడ్డు సమస్య ఏర్పడుతుందని ఫిర్యాదులు అందడంతో ఎమ్మెల్యే అక్కడ పర్యటించారు.

వివాహ ఉచిత పరిచయ వేదికలను వినియోగించుకోండి

కాచిగూడ, నవంబర్ 22: మానవతా దృక్పథంతో యువకులు వరకట్నం తీసుకోకుండా వివాహాలు చేసుకోవాలని విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రాచారి పిలుపునిచ్చారు. విశ్వకర్మ ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. విశ్వ బ్రాహ్మణ యువత కోసం ఈ నెల 23వ తేదీన ఓల్డ్ బోయిన్‌పల్లిలోని భవానీనగర్ శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, అదే విధంగా ఈ నెల 24వ తేదీన ఉదయం10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కాటేదాన్‌లోని శ్రీ విరాట్ విశ్వకర్మ దేవాలయంలో వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ, ఏపీ, రాష్ట్రాల యువత ఈ వివాహ పరిచయ వేదికల్లో పాల్గొని వివాహ సంబంధాలు పెంపొందించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నం. 94918 88266, 85200 07676లలో సంప్రదించాలని కోరారు.

ఎల్ ఎల్ ఎం పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 22: ఓయూ పరిధిలోని ఎల్ఎల్ఎం కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎల్ఎం (సీబీసీఎస్), ఎల్ఎల్ఎం (నాన్ సీబీసీఎస్) పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నీటి సరఫరాను మెరుగుపర్చాలి

బండ్లగూడ, నవంబర్ 22: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీటి సరఫరాను మెరుగుపరిచి ప్రజలకు తాగునీటిని అందించాలని జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌ను కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వారానికి ఒకసారి నీటి సరఫరా చేయడం ద్వారా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నీటి సరఫరా లేక పోవడంతో పాటు సమయ పాలన కూడా పాటించకుండా అర్ధరాత్రి నీటిని సరఫరా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తోడుగా నీటి బిల్లులను పెంచి అధిక బిల్లులు వేస్తూ ప్రజల నడ్డి విడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జలమండలి అధికారులు తగిన చర్యలు తీసుకుని నీటి సరఫరాను మేరుగుపర్చడంతో పాటు బిల్లులను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎం ఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 22: ఓయూ పరిధిలోని ఎంఫార్మసీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) (ఆల్ స్పెషలైజేషన్స్) రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 25వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంబీఏ (టీఎం), ఎంబీఏ (ఈవినింగ్) ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 22: ఓయూ పరిధిలోని ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి తెలిపారు. ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమిస్టర్ విధానంలో అందజేసే కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) క్లాస్‌రూం బ్లాక్‌లో ఈనెల 24న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాన్ని చూసుకోవాలని సూచించారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT SIDDIPET
A.S.No. 28 of 2023.
Between:
Vadakattu Srinivas ...Appellant
A N D
Peta Venkati and 5 others ...Respondents.
To
3. Gulam Mustafa Siddiqui, S/o. Gulam Mohammad Siddiqui, Aged about 75 years, Occu: Business, R/o. H.No. 3-5-780/19/2, Kingkoti, Hyderabad.
Please take notice that the appellant has filed the above appeal against you and others and the case stands posted to 18-12-2024 for your appearance either in person or through your counsel at 10.30 A.M. If you fail to appear the above Hon'ble Court the matter will be decided ex-parte.
// BY ORDER OF THE COURT //
G.KALI PRASAD,
Advocate & Notary
Gajwel, Dist: Siddipet,
Cell No. 9440493461